## హారర్ స్టోరీ

వేసవికాలం. మధ్యాహ్నం ఒంటిగంటయింది.

వడగాలి శబ్దం పిశాచాలు ఒక్కుమ్మడిగా అరుస్తున్నట్టుగా ఉంది. పనివాళ్ళంతా భోజనానికి వెళ్ళిపోయారు. ఎస్టేటంతా నిర్మానుష్యంగా ఉంది. ఉటునుపోక నేనొక్కణ్ణే. నాకు నేనే పోటీగా చదరంగం ఆడుకొంటున్నాను. ఎదురుగా ఉన్నగదిలో వెంకట్ నిద్రిస్తున్నాడు. వాడు నా ఒక్కగానొక్క కొడుకు!

ఇంతలో అలజడి ప్రారంభమయింది. పోర్టికోలోని కుక్కలు మొరగడం ప్రారంభించాయి. వాటితోపాటుగా పంజరాల్లో ఉన్న రామచిలకలు కూడ కేరడం మొదలెట్టాయి. నెమళ్ళ అరుపులు కూడ వినవచ్చాయి. క్రొత్తవ్యక్తులు ఎవరయినా వచ్చి ఉంటారని ఊహించాను. లేచి నిల్చుని, బాల్కనీ నుండి క్రిందికి చూశాను. ఎవరూ లేరక్కడ. అయినా అవన్నీ ఒక్కపెట్టుగా అరుస్తున్నాయి. గార్డెన్‌లోని పూలమొక్కలు నల్లగా మాడిపోయి ఉన్నాయి. ఎవరో ఆ మొక్కల జీవాన్ని లాక్కుపోయినట్టనిపించింది. ఆశ్చర్యపోయాను చూసి. విషయం అర్థంగాక, ఏమయి ఉంటుందన్నది తెలుసుకునేందుకు గబగబా క్రిందికి దిగాను.

కుక్కలు రెండూ అలంగం తిరుగుతున్నాయి. ముందు కాళ్ళతో ఎగిరెగిరిలేస్తున్నాయి. నాలికల్ని బయటికిలాగి, శూన్యంలోనికి రాస్తున్నాయి. ఎవరూ ఉన్నట్టు లేరక్కడ! మరెందుకలా అవి ప్రవర్తిస్తున్నదీ అంతుపట్టలేదు. వాటికి దగ్గరగా నడిచాను. క్షణంలో జరిగిందది! రెండు కుక్కలూ తుళ్ళపడి వెల్లకిలా పడ్డాయి. విలావిలాకొట్టుకొన్నాయి. తాకి చూసేసరికి ప్రాణం విడిచి ఉన్నాయి. వాటి శరీరాల మీద రక్తంలో ముంచితీసిన వేలిముద్రలు!

జీవితంలో తొలిసారిగా భయపడ్డాను- ఆ ముద్రలుచూసి. క్షణంపాటు అచేతున్నయ్యాను. అంతలోనే ధైర్యం పుంజుకొని స్పష్టాస్పష్టంగా వినవస్తున్న శబ్దాల్ని చెవులు రిక్కించుకొని విన్నాను. మువ్వలపట్టీల శబ్దం, గాజులశబ్దం కలగలసి వినిపిస్తూంది. ఎక్కడ్నుంచి అన్నది తెలియడంలేదు. కొద్దిదూరంలో మనిషి పరిమాణంలో సుడిగాలి లేచింది. సుళ్ళు తిరుగుతూ ఆ గాలి పంజరాల్లోని చిలకలకి దగ్గరగా వెళ్తూంది. అనూహ్యమనిపించి, అప్పుడు అర్థమయింది- సుడిగాలికాదది. నీలి ప్రేతాత్మని! నీలి చనిపోయి కాదు, చంపబడి సరిగ్గా ఈనాటికి సంవత్సరమయింది.

మా ఇంటి తోటమాలి కూతురు నీలి. పేరుకి తండ్రి తోటమాలి అయిన పూలతోట సంరక్షణంతా నీలి చూసేది. పూలతోటనే కాదు, కుక్కల్ని, చిలకల్ని, నెమళ్ళని కూడ సంరక్షించేది. వేళపట్టుకు మొక్కలకి నీరుపోయడం, కుక్కలకి, చిలకలకి, నెమళ్ళకి ఆహారాన్ని అందించడం నీలి దినకృత్యం. తోట, తోటలోని ఆ జంతువులు, పక్షులూ నీలి స్నేహితులు. యజమానులమయిన మాతోకంటే, నీలితోనే వాటన్నిటికీ అనుబంధం హెచ్చు.

పదహారేళ్ళ ప్రాయంతో నీలి పచ్చగా, అందంగా ఉండేది. లంగావోణీలో ముద్దుముచ్చటగా ఉండేది. ఆ రోజుల్లోనే, శలవుల్ని గడిపేందుకు ఎస్టేట్‌కి వచ్చాడు వెంకట్. వెంకట్ వయసు ఇరవైయ్యేళ్ళు. సిటీలో ఎం.బి.బి.యస్. చదువుతున్నాడు. తల్లిలేనిలోటునుతెలిసిరాకుండా పెంచుకొస్తున్నాను వాణ్ని. వాణ్ని 'చినబాబు' అని పిలిచేది నీలి. వాడికి కావాల్సిన సదుపాయల్ని అందచేస్తుండేది.

ఎలా కలిసాయో, వాళ్ళిద్దరి మనసులూ కలిశాయి. నీలి, వెంకట్ ప్రేమించుకొన్నారు. వెంకట్‌కి నీలితోడిదే ప్రపంచం. నేనది ఆలస్యంగా తెలుసుకోగలిగాను. తెలుసుకొన్నప్పటికే వాళ్ళ ప్రణయం శృతిమించింది.

సంవత్సరం క్రితం ఇదే రోజు—

ఓ మధ్యాహ్నం వేళ—

పూల మొక్కల నీడన కూర్చొని ఉన్నారు వెంకట్, నీలి. ఇద్దరికిద్దరూ తన్మయంగా ఒకరి



